క్లుప్తంగా

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది అపర్ణాదేవి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా లైంగిక వేధింపుల చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయవాది అపర్ణాదేవి మాట్లాడుతూ మహిళలు ఆధునిక సమాజంలో పలు రకాలుగా వేధింపులకు గురవడం ఆవేదన కలిగించే అంశమన్నారు. విద్యార్థి దశలోనే లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన పెంచుకుని, తోటి మహిళలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కళాశాలలు, పని ప్రదేశాలలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి, డాక్టర్ వై.శిరీష, డాక్టర్ భువనేశ్వరీదేవి, డాక్టర్ ఉమారాణి పాల్గొన్నారు.

వీఆర్‌ఓల సంఘం మండల అధ్యక్షుడిగా సిద్ధయ్య



కొత్త కార్యవర్గంతో వీఆర్‌ఓలు

చంద్రగిరి : వీఆర్‌ఓల సంఘం మండల అధ్యక్షుడిగా సిద్ధయ్య ఎన్నికయ్యారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా యజ్ఞశ్రీ, ఉపాధ్యక్షుడిగా విష్ణు వర్ధన్, సంయుక్త కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా రెడ్డి ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత మూడేళ్లుగా ఇంటర్ నుంచి పీజీ చదివిన విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని అవార్డులతో ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు నాదముని, వెంకటేష్, యశ్వంత్‌కుమార్, శ్రీధర్, శ్రీను, భవానీ శంకర్ పాల్గొన్నారు.


సేవాదృక్పథంతో రక్తదానం



రక్తదానం చేస్తున్న రాస్ సిబ్బంది

తిరుపతి కల్చరల్ : సేవా దృక్పథంతో రక్తదానం చేసి పలు ప్రాణాల రక్షణకు సహకరించాలని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం పిలుపు నిచ్చారు. డాక్టర్ గుత్తా మునిరత్నం 89వ జయంతి సందర్భంగా రాస్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా రాస్ మునిరత్నం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వెంకటరత్నం మాట్లాడుతూ నిరుపేదల ఆశాజ్యోతిగా మునిరత్నం అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం రుయా, మెటర్నిటీ, బాలాజీ బస్టాండ్, అలిపిరి, కపిలతీర్థంలో అన్నదానం చేపట్టారు. దివ్యాంగులకు వీల్ చైర్, లాంగ్ హ్యాండ్ స్టిక్స్ అందజేశారు. కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, మహిళా వికాస్ అధ్యక్షులు సమత, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్లు వి.నాగరాజు, యువరాజు, మోహన్, ప్రసాద్, నందిని పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ



లోగను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టేడియంలో ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న సామూహిక సూర్య నమస్కారం కార్యక్రమ లోగోను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం ఆవిష్కరించారు. వివేకానంద కేంద్రం సంచాలక్ వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ నగరంలోని అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన సుమారు 10వేల మంది విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవి, సురేంద్ర, సుమన, వివేక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆక్రోశం



స్విమ్స్ ఆస్పత్రిలోని సిబ్బంది వ్యవహారశైలితో రోగులు, సహాయకులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఎంట్రన్స్ కౌంటర్ వద్ద ఓపీ పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే బిల్లులు చెల్లించే క్రమంలో కూడా ఇక్కట్లు తప్పడం లేదు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సైతం రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు.ముఖ్యంగా షిఫ్ట్ మారే సమయంలో అయితే మరింత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రశ్నించిన వారిని సెక్యూరిటీని పిలిపించి బయటకు తరిమేస్తున్నారు. - తిరుపతి తుడా

ఆందోళన



ప్రతిష్టాత్మక రుయా ఆస్పత్రి ప్రాంగణంలో రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. రెండేళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్లు గుంతలమయంగా మారిపోయాయి. కేబుల్ వైర్ల కోసం ఇరువైపులా తవ్వేసి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఎంఎం వార్డు, చిన్నపిల్లలు, ప్రసూతి ఆస్పత్రులకు వెళ్లే మార్గాలు రోగులకు ఆందోళన కలిగిస్తున్నాయి. - తిరుపతి తుడా

ఆవేదన



చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డులోని పుట్టాలమ్మ ఆలయం వద్ద వారం క్రితం తాగునీటి పైప్ లైను దెబ్బతింది. నీరు పైకి ఉబికి వస్తూ రోడ్డుపై చేరుతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. అలాగే తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. - చంద్రగిరి

మా రూటే సపరేటు..

ఎప్పుడైనా వస్తాం.. ఎప్పుడైనా వెళ్లిపోతాం.. మేం వచ్చిందే టైం.. అంతా మా ఇష్టం అన్నట్టు తయారైంది విధి నిర్వహణలో ఎస్వీయూ ఉద్యోగుల విధానం. వర్సిటీ పరిపాలన భవనంలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది వైఖరిపై విద్యార్థులు మండిపడుతున్నారు. ప్రధానంగా ఎగ్జామినేషన్ విభాగంలోని ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కార్యాలయానికి రావడమే కాకుండా.. వచ్చిన తర్వాత పక్క డిపార్ట్‌మెంట్‌ల వారితో బాతాఖానీ కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో వివిధ సర్టిఫికెట్లు.. కాన్వికేషన్ దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత సిబ్బంది కోసం వెతుక్కుంటూ తిరగాల్సి దుస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు.



పరీక్షల విభాగంలో సోమవారం ఉదయం 11గంటలకు కూడా ఖాళీ కుర్చీలు

అంతా మా ఇష్టం!

- ఎస్వీయూలో ఉద్యోగుల తీరే వేరు
- ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియదు
- అమలు కాని బయోమెట్రిక్ హాజరు
- సిబ్బంది వైఖరితో విద్యార్థుల అవస్థలు



మరో విభాగంలో ఇలా..

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఏడీ బిల్డింగ్‌లోని పలు విభాగాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల తీరుపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సుదూర ప్రాంతాల నుంచి సర్టిఫికేట్లు, ఇతరత్రా పనుల నిమిత్తం వచ్చే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. గంటల తరబడి ఉద్యోగుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ తంతు వర్సిటీలో నిత్యకృత్యంగా దర్శనమిస్తోంది. మెరుపుతీగను తలపించేలా ఉద్యోగులు విధులు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అధికారులు హెచ్చరించినా..

యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ స్థాయి అధికారులు పరిపాలనా భవనంలోని పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హెచ్చరించినా కొందరు ఉద్యోగుల తీరులో మార్పు కనిపించకపోవడం ఆశ్చర్యకరం. కొన్ని విభాగాలలో బయోమెట్రిక్ విధానం లేకపోవడంతో ఉద్యోగులు తమకు ఇష్టం వచ్చిన సమయానికి విధులకు హాజరవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రధానంగా ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ఎక్కువగా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తుంటాయని, పట్టించుకునే నాథుడు కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయోమెట్రిక్ అవసరం



ఎస్వీయూ ఏడీ బిల్డింగ్‌లోని ఎగ్జామినేషన్ సెక్షన్ దారుణంగా తయారైంది. ఉదయం 11గంటలు దాటినా ఉద్యోగులు విధులకు హాజరుకావడం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చే విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి. విధులకు సకాలంలో హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలి.

– అశోక్ కుమార్, పరిశోధక విద్యార్థి, ఎకనామిక్స్ విభాగం, ఎస్వీయూ

క్షయ నిర్మూలనపై అవగాహన

తిరుపతి తుడా : క్షయ నిర్మూలనపై అవగాహన సదస్సును సోమవారం స్థానిక ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు, జిల్లా టీబీ కంట్రోల్ సొసైటీ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యాధి సోకేందుకు కారణాలు, నివారణ, చికిత్స తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ శ్రీధర్, ఎం.నారాయణప్ప పాల్గొన్నారు

డాక్టర్ శ్యామ్‌బాబుకు అభినందన



శ్యామ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రవీణ్

తిరుపతి కల్చరల్ : వంద పడకల ఆస్పత్రిగా ఈఎస్‌ఐని అభివృద్ధి చేయడంతోపాటు ఐఎంఏ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్‌బాబును బాలాజీ నర్సింగ్ కళాశాల అధినేత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అభినందించారు. సోమవారం ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ప్రవీణ్ మాట్లాడుతూ నిబద్ధత, కార్యదక్షత శ్యామ్‌బాబు సొంతమని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 191 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జెస్సీ గ్రేస్, విజయకుమారి, బి.విజయన్ పాల్గొన్నారు.

'అన్నా' వాదన అర్థరహితం



మాట్లాడుతున్న వాసుయాదవ్

తిరుపతి కల్చరల్ : డీకేటీ భూమికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని అన్నా రామచంద్రయ్య వాదించడం అర్థరహితమని టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం కోసం అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించారన్నారు. అప్పట్లో జీవకోన వద్ద 100 అడుగుల రోడ్డును అడ్డుకుంది అన్నా రామచంద్రయ్యే అని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణంలో తన స్థలం పోతుందని రాద్ధాంతం చేసి, కోర్టుకెక్కారని ఆరోపించారు. రోడ్డు పనులు పూర్తి చేసేందుకు వచ్చిన పురపాలక అధికారులపై దౌర్జన్యం చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఆయన తనదంటున్న భూమి ని గతంలో స్కావెంజర్స్ ఇంటి స్థలాలకు కేటాయించి డీకేటీ పట్టాలు ఇచ్చారని వెల్లడించారు. ఆ భూమిని ఎప్పుడైనా ప్రజావసరాలకు వాడుకోవచ్చనే నిబంధన ఉందని స్పష్టం చేశారు. సదరు భూమి చేతులు మారి ఇప్పుడు రామచంద్రయ్యకు దక్కిందన్నారు. ఇప్పుడు ఆ డీకేటీ భూమికే టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని నానా యాగీ చేస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన భూములే అధికంగా పోయాయని తెలిపారు. జీవకోన ప్రజలను అడ్డుపెట్టుకుని ఎదిగిన అన్నా రామచంద్రయ్య, ఇప్పటికైనా వారి క్షేమాన్ని కోరాలని సూచించారు. ఆయనకు డబ్బులే ముఖ్యం అనుకుంటే వైఎస్సార్‌సీపీ తరఫున రూ.2లక్షలు, మిగిలినవి జోలె పట్టి యాచించి అయినా చెల్లిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు డిష్ రమణ, నవీన్, కోటి, ప్రసాద్, స్వరూప్ పాల్గొన్నారు.

లోకనాథ్‌స్వామికి ఘన స్వాగతం



స్వామికి స్వాగతం పలుకుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ మందిరంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఇస్కాన్ జాతీయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు సోమవారం ఈ మేరకు త్రిదండి లోకనాథస్వామి విచ్చేయగా ఇస్కాన్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణ దాస్, రూపేష్ ప్రభు దాసు, మురళీ దాసు, లీలా పారాయణదాసు, విశ్వంభర గోపాల్ దాస్ ప్రభు పాల్గొన్నారు.

పార్కుల పరిశుభ్రత తప్పనిసరి

తిరుపతి తుడా : నగర ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కులను పరిశుభ్రంగా ఉంచడం తప్పనిసరని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ తరహాలోనే హోటళ్లు, వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్‌ల నుంచి వేర్వేరుగా తడి పొడి చెత్తను సేకరించాలన్నారు. పార్కులు, పలు స్కూళ్లలో మరుగుదొడ్లు లేవని ఫిర్యాదు వస్తున్నాయని, అంచనాలు సిద్ధం చేస్తే నిర్మించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. తొలిదశలో గుర్తించిన రోడ్లపై గుంతలను పూడ్చించామని, ఇప్పుడు చేపట్టినవి కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నా క్యాంటీన్లలో నాణ్యమైన భోజనం వడ్డించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఫ్లెక్సీలు, బోర్డులపై చర్యలు

నగరంలోని కూడళ్లు, ఫుట్‌పాత్‌లపై ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అనుమతి పొందిన హోర్డింగులపైనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని, నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. టీడీఆర్ బాండ్ల పంపిణీకి సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

గ్రీవెన్స్‌కు 39 వినతులు

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వివిధ సమస్యలపై 39 వినతులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే అర్జీలు పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఆర్‌డీ సంజీవ్‌కుమరన్, సబ్ రిజిస్ట్రార్ నీరజ, డీసీప మహాపాత్ర, తుడా సీపీఓ దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వమే ప్రగతికి సోపానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : నైపుణ్యంతో కూడిన విద్యతో పాటు సేవా దృక్పథం సమ్మిళితమైన వ్యక్తిత్వమే ప్రగతికి సోపానమని, ఆ దిశగా యువత ముందుకు సాగాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు అంకుర్ జాన్ వాలా పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో చాప్టర్ అధ్యక్షుల మూడు రోజుల శిక్షణను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. అంకుర్ జాన్ వాలా మాట్లాడుతూ సామాజిక స్పృహతో సమాజ హితం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. శిక్షకులు శిరీదండూ, పూసర్ల రజిత, హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, సామర్థ్యం పెంపు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో జేసీఐ తిరుపతి జోన్ అధ్యక్షుడు శేషసాయి, వివిధ జోన్‌ల అధ్యక్షులు సంతోష్, చతుర్వేది, భరత్, నేతలు జీఎల్ మనోహర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాణ్యత లేని 'భోజనం'

చంద్రగిరి : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం వడ్డిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ ఆరోపించారు. సోమవారం చంద్రగిరిలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిడస కట్టిన అన్నం, నీళ్ల సాంబారును చూసి నివ్వెరపోయారు. విద్యార్థినులతో కలిసి భోజనం రుచి చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఇదే పాఠశాలలో భోజనం చేసి 34 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇప్పుడు కూడా నిర్వాహకులు అదే నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నాసిరకమైన ఆహారం పెట్టి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టకపోవడం దారుణమని, ఇప్పటికైనా చర్యలు చేపట్టకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.


శ్రీనివాసునికి వెండి కవచాలు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీనివాసుని ఉత్సవమూర్తికి సోమవారం దాతలు వెండి కవచాలను వితరణగా అందించారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి అనే దాత సుమారు రూ.1.80లక్షల విలువైన వెండి కవచాలను ఆలయ ఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణికి అందజేశారు.



వెండి కవచాలు అందజేస్తున్న దాతలు

స్వప్నకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కామర్స్ విభాగ పరిశోధకులు పి.స్వప్న డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ రాజశేఖర్ పర్యవేక్షణలో 'మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆన్ 7 పీసెస్ ఆఫ్ షాపింగ్ మాల్స్ ఇన్ ఇండియా–ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టూ బెంగుళూరు సిటీ' అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

కళాకారుల 'నగర సంకీర్తన'

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో నగర సంకీర్తన చేపట్టారు. సోమవారం ఈ మేరకు శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడవీధుల్లో భజనలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, వాసుదేవరెడ్డి ,మునినాధరెడ్డి, మునిరత్నం ఆచారి, వాసు, పొన్నాల జేజిరెడ్డి, హనుమంతరావు , కేశవులరెడ్డి, తిరుపాల్ ఆచారి, కోదండపాణి, జయమ్మ, ఉషారాణి, అరుణకుమారి, కల్పన, మహాలక్ష్మి, చెంగారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీగా వెళుతున్న కళాకారులు

చేపల వేటకు వెళితే ప్రాణమే పోయింది

భాకరాపేట: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీటి కుంటలో పడి మృతి చెందినట్లు ఎర్రావారిపాళెం పోలీసులు తెలిపారు. వారి కథనం.. ఎర్రావారి పాళెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ తోటి దళితవాడకు చెందిన కె.వెంకటరమణ (49) సోమవారం చేపల వేటకు వెళ్లాడు. నీటి కుంటలోకి దిగగానే పాచి తగులుకుని కుంటలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఎర్రావారిపాళెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ జీవనాధారమైన వ్యక్తి మరణంతో ఆ కుటుంబం వీధిన పడింది. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

విశిష్ట సేవలకు అవార్డులు



అవార్డు అందుకున్న మహిళలతో అతిథులు

తిరుపతి కల్చరల్ : నగరంలోని యూత్ హాస్టల్‌లో సోమవారం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 50 మంది మహిళలకు సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డులు అందించారు. వే ఫౌండేషన్, బీసీ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదానోత్సవం చేపట్టారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు టి.గోపాల్ మాట్లాడుతూ సమాజానికి స్ఫూర్తిదాతలు స్త్రీమూర్తులే అని వెల్లడించారు. కార్యక్రమంలో బహుజన మేధావుల ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ వెంకటనారాయణ, వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య, టీడీపీ నేత నరసింహయాదవ్, టూరిజం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీరాములు, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టా భాస్కర్ యాదవ్, నేతలు విజయప్రశాంతి, గణేష్‌బాబు, సునీల్ దత్త, వరలక్ష్మి, విజయకుమార్, వినోద్, పాపయ్య పాల్గొన్నారు.